చుల్కన అవడం నేను సహించలేను. ఏం చెయ్యడం? ఇద్దరం ఎంతో సేపు ఆలోచించాం. ఎంతో చర్చించాం. ఎన్నో పరిష్కార మార్గాలు వెతికాం. ఆఖరికి నాకు ఉపాయం తట్టింది. ముందుగా ఆ పసిబిడ్డని ఎలాగో అనాధ శరణాలయంలో చేర్పితే తరువాత ఏదో వంకన ఆ బిడ్డని పెంచుకునే నెపంతో యింట్లో చేర్పవచ్చని ఆలోచించాను. ఇలా అయితే ఎవరికీ ఆ బిడ్డ మా రక్తం పంచుకు పుట్టిన బిడ్డే అని తెలియదు. ఆ బిడ్డా అనాధ అవదు అని ఆలోచించాం. బిడ్డని పెంచుకోడానికి తెచ్చుకోవడమూ అంత తేలికకాదని నాకు తెలుసు. అయితే నా పెద్ద కోడలికి మొదటిసారి కాన్పు చాలా కష్టమై, ఏదో అవాంతరం జరిగి అతి కష్టంమీద ఆపరేషన్‌చేసి బిడ్డని తీశారు – మళ్ళీ యింకోసారి కాన్పు రాకూడదని గర్భసంచీయే తీసేసారు. ఆ వున్న వక్క నలుసు తప్ప మరి మాయింట బిడ్డలు లేరు కనక ఆడపిల్లకోసం అంటూ ఈ బిడ్డని పెంచుకోవచ్చు అని ఆలోచించాను. నా ఆలోచనకి నా కొడుకుకూడా సమ్మతించాడు – బిడ్డను పెంచుతున్న ఆయా భర్తచేత రహస్యంగా ఓనాడు ఆ బిడ్డని శరణాలయంలో విడిచిపెట్టించాం. ఆబిడ్డ మెడలో వెంకటేశ్వరుని రాగిబిళ్ళ వుంటుంది ఆనవాలుగా. మొదటి పనిపూర్తి అయింది. తరువాత ఏదో వంకన శరణాలయం నించి ఆ పిల్లను తీసుకురావాలనుకుంటుండగానే ఈలోగా ఘోరమైన కారు ప్రమాదంలో నా కొడుకు, కోడలు, మనవడు అందరూ చనిపోయారు. ఆ హఠాత్ సంఘటనతో కొన్నాళ్ళు అసలు మతే లేకుండా పోయింది. కాస్త ఆ దుఃఖం ఉపశమించాక చనిపోయిన నాకొడుకు ఆత్మశాంతికైనా నేను ఆ బిడ్డని అలా అనాధగా వదిలేయరాదని నిశ్చయించాను. కానీ ఏ వంకతో యింటికి తీసుకురాను, నేను మంచాన పడిన రోగిష్టిని, రంగారావు పిచ్చివాడిలా యిల్లుపట్టకుండా తిరుగుతున్నాడు. వాడికి ఏమని చెప్పి వప్పించను. అక్కడికి ఎన్నిసార్లు యిల్లు పాడుపడినట్టుంది పెళ్ళితే వప్పుకోకపోతే కనీసం ఏ బిడ్డనైనా తెచ్చి పెంచుకుందాం, అంటూ చెప్పాను. రంగారావు నామాట వినలేదు. ఎన్నిసార్లు ఆ ప్రసక్తి తెచ్చినా "ఏమిటమ్మా పిచ్చి మనవాళ్ళనుకున్నవాళ్ళే మనని విడిచి పోయారు, ఎక్కడినుంచో తెచ్చి పెంచుకున్నది మనబిడ్డ ఎలా అవుతుంది? అనవస

రంగారావు జంజాటం మనకెందుకు మీరురోగిష్టి నేను మగవాడిని యింట్లో దాసదాసీలున్నా బిడ్డని పెంచటం అంతమాటలా-సరిఅయిన ఆదరణ చూపకుండా దాదీలమీద విడిచిపెడితే దానికి యీ కొత్తబంధం మనకెందుకు అంటూ కొట్టిపారేశాడు. ఇంకేం చెయ్యను మా రక్తం పంచుకు పుట్టిన బిడ్డ అలా దిక్కూ మొక్కూ లేని అనాధగా పెరుగుతూందన్న నిజం నాగుండెని దహిస్తూంది శ్యామలా! నా కొడుక్కిచ్చిన మాట నిలుపుకోలేక పోయానన్న ఆవేదన నాకు శాంతి నీయడం లేదు. ఆ బిడ్డని అలా వదలేస్తే చచ్చిపోయిన నాబిడ్డ ఆత్మశాంతిగా వుంటుందా. ఈ నిజం తెలిసే నేను యెలా ప్రశాంతంగా బ్రతకగలను చెప్పు!" ఆవిడ విషాదంగా అంతా చెప్పుకొచ్చి నిట్టూర్చింది. నేను ఆశ్చర్యపోయాను అంతకంటె ఈ జమీందారిణీ తనతో చెప్పడంలోగల అర్థం బోధపడక మరింత ఆశ్చర్యపోయాను. నామొహంలో ఆశ్చర్యం గుర్తించి జమీందారిణి తిరిగి మొదలుపెట్టారు.

"శ్యామలా! ఈ విషయాలన్నీ నీకెందుకు చెప్తానని ఆశ్చర్యపడుతున్నావుగదూ! చూడు శ్యామలా! ఆబిడ్డని ఈ ఇంట్లోకి తీసుకురావడం అన్నది జరిగితే అది నీవల్లనే కావాలి..."

"నేనా...?" ఆశ్చర్యంగా అడిగాను. "నేనా....ఎలా....'

"శ్యామలా .... నీవు చెప్పితే రంగారావు కాదనడన్న నమ్మకం నాకుంది. ఈ రెండు నెలలుగా ఇంట్లో నీవు వచ్చినాక వాడెంత మారింది నేను గమనిస్తూనే ఉన్నాను."

నామొహం ఏర్రబడింది... తడబడ్తూ ఏదో అనబోయాను. జమీందారిణి అది గుర్తించినట్టే. "శ్యామాలా మంచంలోంచి కదల్లేని ఓ వృద్ధురాలి కడసారి కోరిక యిది. ఈ పని నెరవేర్చకుండా ప్రశాంతిగా నేను చనిపోను, నా కోరిక తీర్చగలవా." అంత గంభీరత ఏమయిందో ఓ యాచకురాలిలాగ ఆవిడ ఆశగా ఆరాటంగా నా వంక దీనంగా చూసారు. ఆవిడ మొహం చూస్తూ ఏం జవాబివ్వాలో తట్టక ట్టు అచేతను రాలినయ్యాను.

"కాని....కాని.... నేను చెపితే ఆయన వింటారా. అసలు అంత చనువు నాకేది...." తడబడ్తూ బిడియంగా అన్నాను. 'అసలు ఏమని అడగను ?"

"ఏమని అడుగుతావో, ఏం చేస్తావో అది నాకు తట్టకే నిన్ను అడుగుతున్నాను శ్యామలా. వాడికి ఏమని చెప్తావో ఎలా వప్పిస్తావో నీవే ఆలోచించు. ఈ రహస్యం మాత్రం వాడికి ఎంత మాత్రం తెలియకూడదు. వాడి దృష్టిలో నా కొడుకు దిగజారడం నేను సహించలేను శ్యామాలా. నీవు ఒకప్పుడు అనాధగా పెరిగావు. అనాధ అంటే ఏమిటో నీకంటె ఎవరికీ బాగా తెలియదు. యింత జమీ, యింతా ఆస్థి వుండి నా బిడ్డ రక్తం పంచుకు పుట్టిన బిడ్డ అలా అనాధగా పెరగడం నేను సహించలేను శ్యామలా, ఏం చేస్తావో ఆ బిడ్డని యీ యింట చేర్చు, అది నాకోరిక. ఏం తీర్చగలవా." వృద్ధ జమీందారిణి కంటతడి బెడ్తూ, వణుకుతున్న చెయ్యి ముందుకు చాపారు. అప్పుడింక నా కర్తవ్యం ఏమిటి ? కాదని, చెయ్యనని ఎలా చెప్పగలను.

"శ్యామలా వెంటనే కాకపోయినా కాస్త సమయం చూసి నెమ్మదిగా చెయ్యచ్చు. నాకు మాట యిస్తే నాకు నిశ్చింత యింక" అంటూ ఆవిడ తొందర పెట్టారు, యింక ఆలోచించేందుకు, అనేందుకు ఎమీ లేక ఆవిడ చేతిలో చెయ్యి వేశాను. నా శాయశక్తులా ప్రయత్నిస్తానని, ఆ బిడ్డని అనాధగా వదిలివేయనని, ఈ సంగతి నా పెదవి దాటి బయటికి రాదని వాగ్దానం చేశాను. ఆమె నిశ్చింతగా నిట్టూర్చారు. నా వంక అభిమానంగా, కృతజ్ఞతగా చూశారు. "నీవు చేయబోయే మంచి పనికి భగవంతుడు తప్పక సహకారం యిస్తాడు. నీకు కృతజ్ఞతగా నేనేమి యియ్యను శ్యామలా" అంటూ ఆవిడొక్క క్షణం ఆలోచించి ఆవిడ మెడలో నున్న ముత్యాలహారం బయటికి తీసారు. 'శ్యామలా యిది కొన్ని వేలు విలువ చేసేది. అయినా నీకు ఆ పని చెయ్యడానికి బహుమానంగా యీయడం లేదు. నా అభిమానం, కృతజ్ఞత చూపుకోడాని కిస్తున్నాను' అన్నారు. నేను హర్ట్ అయ్యాను. ఆవిడ దృష్టిలో నేనూ ఒక దాసీనే. కాని ఆ విషయంనేనుఅంగీకరించకపోయాను.

'క్షమించండి. డబ్బు కోసం నేనీ పని చేస్తానని అనలేదు. జమీందారుగారు నాకు చేసిన దానికి బదులుగా నే నెంత చేసినా మీ ఋణం తీరదు. నేనే మీకు బాకీ. అంచేత నా కృతజ్ఞత చూపుకోడానికి మీరు నా మీద పెట్టిన భారం స్వీకరి స్తున్నాను' అంటూ బయటికి వచ్చేశాను.

ఆరోజు జరిగిన సంగతి అది. తరువాత ఎన్నోసార్లు ఆ విషయం గురించి ఏం చెయ్యాలా అని ఆలోచించేదాన్ని. మిమ్మల్ని ఏమని అడగడమో, ఎలా వప్పించడం అన్నది తేలక కొట్టుమిట్టాడాను. ఈ లోపలే మీరు ఆ యింట్లో నా స్థానం పని మనిషిగా కాదని, నా చోటు మీ హృదయంలో వుందని నిరూపించారు. ఆనాడు నాకు పట్టిన అదృష్టాన్ని తలుచుకుని నే నెంత సంతోషించానో మీకు తెలుసు–మన వివాహవార్త మీ అమ్మగారు ఆమోదించరని నాకు తెలుసు – కాని మరో గత్యంతరం లేక ఆవిడ అంగీకరించారు. ఆరోజే ఆవిడ జబ్బు తిరగబెట్టి నోరు, చెయ్యి పడిపోయింది. ఆ స్థితిలో ఆవిడ నన్నుచూసి ఏదో చెప్పాలని వూరికే తాపత్రయ పడేవారు. కళ్ళతో, దీనంగా చూసేవారు ఒకసారి. బహుశ ఉష విషయమే గుర్తు చేస్తున్నారని ఆవిడకి నేను అభయం యిచ్చాను. సమయం చూసి ఆ పని పూర్తి చేస్తానని మాటిచ్చాను మరో సారి. చనిపోయే రోజు మీతో కూడ ఏదో చెప్పాలని, కనీసం రాయాలని ఎంతో ప్రయత్నించి ఏమీ చెప్పలేక విఫలు లయ్యారు. ఆవిడ ఉద్దేశం ఏమిటోగాని ఉష గురించే అని అర్థం చేసుకున్నాను. జమీందారిణి గతించడం – మన వివాహం అన్నీ అయ్యాక ఓ రోజు శరణాలయం చూడడానికి వెళ్ళడం – అక్కడ ఉషని గుర్తించి – పాపని పెంచుకోడానికి మిమ్మల్ని వప్పించడం విషయాలు మీకు తెలుసు.

నిజంగా మొదటిసారి వాడు నన్ను బ్లాక్ మెయిల్ చెయ్యడానికి వచ్చినపుడు అసలు వాడెవడో నాకు తెలియదు. బ్లాక్ మెయిల్‌కి లొంగి వాడ్ని తొందరగా వదిలించుకోడానికి డబ్బిచ్చాను. రెండో సారి మీరింట్లో వుండి అడిగే అవకాశంలేక వాడికి ఐదువందలిచ్చి హడావుడిగాతరిమేశాను. మూడో సారి వచ్చినపుడు ఏమయినా

సరే వాడికి డబ్బు యీయరాదని, అసలు వాడెవరో తెలుసుకోవాలని నిర్ణయించు కొన్నాను. నిలదీసి అడిగాను. వాడు మీ తమ్ముడి పాపని పెంచడానికి నియమించిన ఆ యా మొగుడని, వాడే ఉషని అనాథ శరణాలయంలో వదిలిన వాడిని తెలుసుకున్నాను. ఉషని అలా అనాధశరణాలయంలో వదలడం, తరువాత పెంపకానికి తీసుకురావడంలో ఏదో వుందని వాడు కనిపెట్టి – ఉష ఎవరో మీకు తెలియదని పనివాళ్ళద్వారా గ్రహించి నన్ను బ్లాక్ మెయిల్ చేసి డబ్బు గుంజ వచ్చని యిలా ఆరంభించాడు. నా దురదృష్టం కాకపోతే మీరు కొద్ది నిమిషాలు ముందు వచ్చివుంటే మా సంభాషణ ముందునుంచి విని వుండేవారు. మీకు అపోహ, అనుమానం లేకపోయేది. 5 ని॥ల దురదృష్టవంతురాలిని. నా దురదృష్టం నన్నింకా వెన్నంటే వున్నప్పుడు అలా ఎందుకు జరుగుతుంది ?

నా అదృష్టం కొద్ది మీ తమ్ముడుగారు వ్రాసుకున్న డైరి నా వశం చేశారు. మీ అమ్మగారు– అందులో అతను ఉష తల్లిని ఎలా చూసినది– ఎలా ఆకర్షితు రాలైనది– వారిద్దరి పరిచయం ప్రేమగా మారిన విషయం – ప్రేమ పెళ్ళికి దారి తీయడం– పెళ్ళి– బిడ్డపుట్టడం వగైరా వివరాలన్నీ అందులో రాయబడి వున్నాయి. వారిద్దరూ తీయించుకున్న ఫోటోకూడా వుంది అందులో – ఈ నిదర్శనమే లేకపోతే ఏ దిక్కూ– మొక్కూ– లేక మీ పంచన చేరిన ఆడదాన్ని నేనేం చెప్పినా కట్టుకథే అయేదేమో !

ఈ మాటలు మీకు కష్టం కలిగిస్తే క్షమించండి – కాని మీరడిగినపుడు నిజం చెప్పలేక పోయిన నా అశక్తత–తిరిగి నాకు అవకాశం ఈయకుండా నానోరు మూసిన మీ మాటలు ఇవన్నీ నా గుండెనెలా తరుగుతున్నాయో మీరు ఊహించగలిగితే నా ప్రయత్నం ఫలించినిట్లే.

మీకు నీతులు చెపుతున్నాననే అనుకోకపోతే ఓ పేదరాలి కడపటిమాట – మీరు ధనవంతులు, ఉన్నత వంశస్తులు, ఆత్మ విశ్వాసం. మనోధైర్యం, పట్టుదల వున్నవారు. తలచుకున్నది చేయగల సమర్థులు. ఇన్నివున్నవారు కాబట్టి ఒక నిర్ణ